# శ్రీరంగం రాజేశ్వరరావు చెప్పిన కథ

## —రామవరపు వేణుగోపాలరావు

వారం రోజులుగా వూరిమీద విరుచుకుపడి ప్రజల ప్రాణాలూ, చెవటా తోడేసిన చండ్రగాడ్పులూ, ఎండవేడిమీ ఆ వేళ ఎక్కడోదాక్కున్నాయి. పొద్దుటసలు సూర్యదర్శనమే కాలేదు. ఆకాశమంతా నల్లని మబ్బులతో అసహ్యంగా సింగారించుకుంది. ఒక్కసారి మేఘాలు గర్జించేయి. దబదబమంటూ పెద్దపెట్టున వర్షం ప్రారంభవయింది. అలా ప్రారంభించిన వర్షం మధ్యాహ్నందాకా ఆగలేదు.

వర్షంతోబాటే అద్దం ముందు కూర్చున్న సుందరి వర్షం వెలిసింతర్వాత గాని లేవలేదు. వర్షం పడ్డాన్నంతసేపూ అలా అద్దం ముందు కూర్చుని కన్నీరు కారుస్తోనేవుంది. కన్నీరంతా కార్చేసేక, ఇక కార్చడానికేమీ లేదని తెలుసుకుని, నిస్పృహగా లేచి కిటికీ దగ్గిరికి వెళ్లి నిలబడింది. పడిన వర్షం మూలంగా రోడ్డుమీద అక్కడక్కడ నీరు నిలిచింది. వల్లబడ్డ భూదేవి వేడివేడి నిట్టూర్పులు సుందరి ముక్కుల్లోకి జొరబడ్డాయి. వర్షం పడినందువల్ల తాత్కాలికంగా ఆగిన ట్రాఫిక్ మళ్లా ప్రారంభ వయింది. రోడ్డుమీద ఎన్నో కార్లూ, సైకిళ్ళూ పరుగెట్టడం ప్రారంభించేయి. పరుగెడ్తోన్నట్టు జనం నడవసాగేరు. కాని సుందరి దృష్టి వాటిమీద కాదు- ఎక్కడో వుంది...

గతరాత్రి జరిగిన సంఘటన సుందరిని పదే పదే వేధిస్తోంది. కలతపడ్డ మనసు కన్నీరు కార్చినా, కలత తుడిచి పెట్టుకుపోతుందా?

లీలామహల్‌కి వెళ్లి తిరిగివస్తోంది. రిక్షా యెక్కడం అనవసరం అనుకుని, సినిమాగురించి ఆలోచించుకుంటూ తాపీగా నడవసాగింది. కాలేజి డౌన్ దగ్గర కాబోలు...నలుగురైదుగురు కుర్రాళ్ల సిగరెట్లు కాల్చుకుంటూ తననే కళ్ళప్పగించి చూడసాగేరు. తనల్లంతదూరాన వుండగానే పకపకలూ వికవికలూ మొదలెట్టేరు. వాళ్ళవేపేనా చూడకుండా ముందుకి సాగిపోయింది. ఎంత వద్దనుకున్నా వాళ్ళలో ఒకడు విసిరిన కామెంటు తన చెవుల్లోకి జొరబడక తప్పలేదు వాడన్నదేవిటి?

'కాఫీ ధర పెరిగింది, టీ ధర పెరిగింది. సిగరెట్లు ఖరీదు కూడా ఆకాశాన్నంటింది. ఆఖరికి అందవైన మొహం కూడా అరుదైపోయిందిరా భగవాన్లూ!'

సుందరొక్కసారి కొయ్యబారిపోయింది. 'ఛ...ఛ...ప్రతివాడూ తన అనాకారితనాన్నెందుకిలా గడియగడియకీ గుర్తుచేస్తున్నాడు?!' అనుకుంది. నీరసంగా కాళ్ళీడుస్తూ యిల్లుచేరింది.

భోంచేసి మంచంమీద పడుకున్నా ఆ ఆలోచన్లు సుందరి బుర్రని ఖాళీ వెయ్యలేదు. లాయర్ నోటీసిచ్చినా అద్దెయిల్లు వదలక పట్టుక్కూర్చున్న గృహస్థులా అవి శాశ్వతంగా ఆమె బుర్రలో పీఠం వేసుక్కూర్చున్నాయి.

వర్షం బాగా వెలిసిపోయింది. సుందరికి హఠాత్తుగా తన స్నేహితురాలు పద్మ యింటికి వెళ్ళాలన్న సంగతి గుర్తుకొచ్చింది. "ఇవాళ పద్మ పుట్టిన రోజు వెళ్ళకపోతే బావుండదు వెళ్ళాలి" అనుకుంటూ హాల్లోకి నడవబోయి ఆగిపోయింది...అమ్మా— పక్కింటి బామ్మగారూ ఏవిటో తనగురించే మాట్లాడుకుంటు న్నారు.

"అయితే అమ్మడూ, మీ సుందీకి పెళ్ళెప్పుడు చేస్తావే? నే బతికుండగా పప్పన్నం పెట్టవా యేవిటే?"

"ఇదిగో-ఇంకెన్నాళ్ళు? ఇంకో ఆర్నెల్లు పోతే దాని చదువు పూర్తవుతుంది. వెంటనే ఆ మూడు ముళ్ళూ పడేయించేస్తాం."

"భగవంతుడు దాని నుదుటలా రాసేడుగానీ, దానికున్న బుద్ధికీ, తెలివికీ సాటైన పిల్లలెవరున్నారు? దానీడు పిల్లేగా మా సరూ...అప్పుడే ముగ్గురు కూతుళ్లనెత్తుకుంది.


"మా అమ్మాయికేం అత్తగారూ...బంగారబ్బొమ్మ. దాని పెళ్ళికేం— మహారాజులా అవుతుంది..."

"నిజవేనమ్మా, నిజవే! ఇక నేను వెళ్లొస్తానే తల్లీ! మా కోడలుపిల్ల వంటెలా తగలెట్టిందో యేమో!" అంటూ బామ్మగారు లేచింది.

అమ్మకి తనమీద ఎంతభిమానం? వూరూ వాడా తన అనాకారితనం గురించి చెప్పుకుంటున్నారు. అమ్మకి మాత్రం తను పసిడిబొమ్మ, 'పిచ్చి అమ్మా!'' అనుకుంది. తను స్కూలు ఫైనల్ పరీక్ష యిలా రాసిందో లేదో నాన్న పెళ్ళికొడుకుల వేట ప్రారంభించేడు. ఎంత మంది అబ్బాయిలు పెళ్ళిచూపులకొచ్చేరో! సుందరి వాళ్ల పేర్లు గుర్తుకి తెచ్చుకుంది. రాజారావు, కామేశ్వరరావు, అప్పలనరసింహం, సన్యాసిశర్మ, విజయరావు, వామనమూర్తి, రమేష్...వీళ్ళందరూ ఇప్పుడెక్కడున్నారో! తనకన్నా అందమైందాన్ని డబ్బు లేకపోయినా పెళ్ళి చేసుకునుంటారు...కొందరికి పిల్లలు కూడా పుట్టుంటారు...

మొహం కడుక్కుంది. తన ఇరవై అయిదో పుట్టిన రోజునాడు తండ్రి కొనిచ్చిన గులాబిరంగు టెర్లిన్ చీరా, దానికి "మేచ్" అయే లేత ఎరుపు రంగు చోళీ బయటికి తీసింది. జడని వదులుగా వేసుకుని మల్లెలదండ తురుముకుంది. సింగారించుకున్నాక నిలువుటద్దం ముందు నిలబడింది.

"నాకు పాతికేళ్ళు దాటేయి, అయితేనేం? నా శరీరం అజంతా గుహల్లో నిద్రపోతున్న శిల్పాల్తో పోటీ వేయగలదు. మశూచికం నడిచిపోయిన జాడలు నా ముఖం మీదున్నాయి. అవే నా దురదృష్టానికి కారణం. అవేగాని లేకపోతే ఈ మగాళ్లందరూ నా కాళ్లమీదపడి నాకంటికొస మాపుంకోసం పడిగాపులు పడేవారేగా...పిచ్చి మగాళ్ళు...ముఖాన్నేం కొరుక్కుతింటారేవిటి? గిలిగింతలు పెట్టే-మగాడి



మగసిరిని మేల్కొల్పి- శరీరంలోని నవనాడుల్లోనీ వల్లటి అగ్నిగుండాలు రేపి- వెచ్చటి మంచుగడ్డలా కరిగించే అందాలు ఆడదాన్లో ఎన్నున్నాయి? ఎవరి సంగతోఎందుకు-నాలో లేవూ? మొన్న ఆ బి.ఏ.. ఫైనలియర్ రమాపతి తన గుండెలవేపు ఎంత వేడిగా మాసేడు? సందుమొగ దాటేందాకా అతని మాపులసలు మళ్ళేయా...? తన నడక... "నీ నడక బహు నాజూగ్గా వుంటుందే!" అని పద్మ ఎన్నిసార్లన్లేదు. కాలేజీ బాలకవి కోటిరెడ్డి నా నడక మీద ఎన్ని పద్యాలు రాసేడు? పైగా నా మనసో? వెన్నపూస. ఎవరికష్టం వచ్చినా అది నాకేనని ఎంత బాధ పడ్డాను! నా ముఖం మచ్చల మూలాన— కాస్త సహించరానిదిగా వుంటుంది గాని నాకేం? లక్షాధికారి బిడ్డని. శిల్పసుందరిని. యౌవనవతిని. నన్నెవరు పెళ్ళి చేసుకోరు? అంతా అమ్మ పిచ్చి. నాపెళ్లి గురించి నాన్నకి బెంగ. 'దీనికా రాతలేదే!' అంటాడు నాన్న. అంటే నా ముఖం మాసి నన్నెవరూ పెళ్ళి చేసుకోరని నాన్న భావం. మన కులం కానివాడైనా సరే ఫర్వాలేదన్న స్థితికూడా నాన్న దిగజారిపోయేడు. హు...పిచ్చివాళ్లు!" అనుకుంది సుందరి.

పద్మా వాళ్లిల్లు చాలా కోలాహలంగా వుంది. అందరికీ మధ్య సోఫాలో కూర్చున్న పద్మ అచ్చంగా పెళ్ళి కూతుర్లా వుంది. "ఆలస్యంగా వచ్చేనేవిటె చెప్మా" అనుకుంటూ పద్మ దగ్గరికి మౌనంగా వెళ్ళిందీ. "ఇలాంటి పుట్టినోజులెన్నో జరుపుకో" అంటూ పద్మ వేలికి ఉంగరం తొడిగింది. 'ఎందుకే సుందీ, ఇదంతా?' అంది పద్మ. సుందరి పెదాల్తో నవ్వేసి వూరుకుంది. ఒకరిమీదొకరు జోక్సు విసురుకోడంతోనీ, కేకల్తోనీ చాలాసేపు గడిచింది ఆఖరి అయిటంగా గానకచేరీ మిగిలిపోయింది.

"నాగేశ్వరావూ, నీవంతొచ్చింది పాడు!" అంది పద్మ.

తొణక్కుండా బెణక్కుండా రెండు పాటలు పాడేశాడతను, 'బాగానే పాడేడు కుర్రాడు' అనుకుంది సుందరి. "ఎవరే అతను?" అంది పద్మచెవిలో. యూనివర్సిటీలో ఎం.ఎస్సీ. చదూతున్నాడు. చాకులాంటి మనిషి...ఏం. నీకు నచ్చేడేవిటే?' అంది పద్మ. సుందరి నాగేశ్వరావుని పరీక్షగా మాసింది కాస్తవలంగా, పొట్టిగా వున్నా ముఖం మాత్రం బావుంది. ఎక్కళ్లేని గ్లేమరూ ముఖం మీదికి తెచ్చుకోడానికి ప్రయిత్నిస్తున్నాడనడానికి వంకీల జుత్తే సాక్ష్యం. సినిమా హీరోలా ఓ సారి సారోపుల్‌గా, మరోసారి ఇన్నోసెంట్‌గా అటూ ఇటూ మాస్తున్నాడు. ఎంచేతో అతను బంగారు చేపను వేటాడబోయే జాలర్లాకన్పించేడు సుందరికి. (ఇందులో ఎవరు చేప? ఎవరు జాలరి? వేటాడేదెవరు? వేటాడబడేదెవరు?-) "పరిచయం చెయ్యనా?" అంది పద్మ కన్ను గీటుతూ. ఎందుకందో ఏవిటో మరి సుందరి 'వూ' అంది తటాలున లేచింది పద్మ.

'మీట్ మై ఫ్రెండ్ మిస్టర్ నాగేశ్వరావ్, ఎం.ఎస్సీ, ఫైనల్-దిసీజ్ మిస్ సందరి ఫైనలియర్ బీయెస్సీ.'

'నమస్తే'

'నమస్తే'

ఆతర్వాత ఏవేవిటో వాళ్ళు మాట్లాడుకున్నారు, ఆఖరికేమైందంటే-సుందరికీ నాగేశ్వరావుకీ మధ్య "మైత్రి" అనే అనుబంధం ఏర్పడింది.

అటుపై వాళ్ళిద్దరూ చాలాసార్లు కలుసుకున్నారు. ప్రపంచం గురించీ, రకరకాల మనుషుల -సైకాలజీల గురించీ, పీస్ గురించీ, ఫ్రాయిడ్ గురించీ మాట్లాడుకున్నారు. ఇద్దరాడవాళ్లు కలిస్తే బంగారం గురించీ నవల గురించీ లేకపోతే పక్కింటి అబ్బాయిల గురించీ మాట్లాడుకుంటారు. సాధారణంగా ఇద్దరబ్బాయిలు కలిస్తేవాళ్ళు అమ్మాయిలగురించీ మాట్లాడుకుంటారు. ఒక అబ్బాయీ, ఒక అమ్మాయీ కలిస్తే-ఆ...ఏం మాట్లాడుకుంటారు? 'ప్రేమ' అని చాలామంది అనుకుంటారు. కాని సుందరీ నాగేశ్వరావులు అది తప్ప అన్ని విషయాలూ మాట్లాడుకుంటారు...



నాగేశ్వరావుని వాళ్ళ నాన్నగారికి ఓనాడు పరిచయం చేసింది సుందరి. 'కుర్రాడు ఫర్లేదు' అనుకున్నాడతను. ఇద్దరి స్నేహానికీ ఇంట్లో యెవరూ అభ్యంతరపెట్టలేదు.

ఓసారి బీచ్‌లో కూర్చున్నారిద్దరూ. సుందరి రిక్వెస్ట్‌మీద నాగేశ్వరావు ఓ పాట పాడేడు. ఆ పాటలోని అర్థం యిది: 'ప్రియా నిన్నే కాంక్షిస్తున్నాను. నువ్వు తప్ప నాకింకో ధ్యాస లేదు. నీ మెత్తని గుండెలో నాకు వెచ్చని చోటివ్వు. ప్రేమ అనే ఖడ్గం చేపట్టి నీహృదయ సామ్రాజ్యం ఏలుతాను'- సుందరి పాటలోని భావాన్ని, పాడిన నాగేశ్వరావు అంతరంగంలోని అర్థాన్ని ఆలోచిస్తూండిపోయింది! మైమరిచిపోయినట్లు వెనక్కివాలి ఇసుకలో వెల్లకితలా పడుకుంది. గాలి తాకిడికి పైట జారింది. సర్దుకునే ప్రయత్నం చెయ్యలేదు సుందరి. వెనక్కి తిరిగి ఆమెని మాసేడు నాగేశ్వరావు. అతని మాపుల తూపులు ఆమె ఎత్తయిన గుండ్రని బుజాల్ని సోకేయి.

'బాగా పాడేరు పాట. ఎవ్వరాసేరు?'

కళ్ళలోకి ధైర్యంగా మాసే ప్రయత్నంచేసి 'హు...నేనే రాసేను.' అని ఏదోలా వప్పుదు కాకుండా నవ్వేడు.

"మీరాసేరా? అబ్బ. చాలా బావుందండీ. ఓ ప్రశ్న వేస్తాను ఏవీ అనుకోరుగద!"

"అబ్బే చెప్పండి."



శ్రీయుతులు యగళ్ళ రామకృష్ణ, రామవరపు వేణుగోపాలరావు, శ్రీరంగం రాజేశ్వరరావు

"మీరెవర్నైనా ప్రేమించారా?"

"ఫీ-ఫీ-యింకా లేదండీ"

"ప్రేమించడం తప్పా? ఫీ...ఫీ...అంటున్నారూ?"

"అహ అది కాదండీ..."

"మరేది?"

సుందరి ప్రశ్నకి సమాధానం రాలేదు. అతని చూపులామె గుండెల మీద, వేడిగా, వాడిగా, బలంగా...చీకటి పడ్తోంది. బీచ్ దాదాపు నిర్మానుష్యంగా వుంది.

'ఏమిటీ మనిషి! అలా గుడ్లప్పగించి చూస్తాడేం? ధైర్యంగా 'సుందరీ, నిన్ను ప్రేమిస్తున్నా. నువ్వే నా ఆరాధ్యదైవం' అని నన్ను చేతుల్లోకి తీసుకుని గట్టిగా బంధించడేం? పాలపొంగులా ఉబుకుతున్న గుండెల్ని 'అదిమి, నా అధరాల్లోని అమృతం అందుకోడేం?' అనుకుంది సుందరి. నాగేశ్వరరావింకా అలా చూస్తూనే వున్నాడు. సుందరికి విసుగేసింది.

అలా అయిదు నిమిషాలు గడిచేయి.

'ఇక పోదామా?' అంటూ లేచింది. పదండి అంటూ నాగేశ్వరరావూ లేచాడు. ఇద్దరూ బైట పార్క్ చేసున్న కార్ వేపు నడిచారు.

* * * *

మర్నాటి పుదయం తలంటుకుని స్నానం చేసింది సుందరి. 'లోనెక్' గౌన్ తొడుక్కుని అద్దం ముందుకూర్చుంది. ఫేన్ గాలికి జుత్తు ఆరబెట్టుకుంటోంది.


గత రాత్రి కలఆమె మనస్సులోంచింకా చెదిరిపోలేదు. ఎంచక్కటికల అది. తనకీ, నాగేశ్వరరావుకీ పెళ్ళయిందట. నాన్నగారు తమిద్దరినీ కాశ్మీర్ వెళ్లమన్నారు. హౌస్‌బోట్లో. తెల్లటి కొండల మధ్య లోయల్లో, పేరు తెలీని పక్షుల కలకలారావాలమధ్య, రకరకాల పువ్వుల వెలుగుల్లో గడిపినట్టు కల. ఓ చోట మైదానంలో కూర్చున్నారు. తన తల నాగేశ్వరరావు ఒళ్లో వుంది. తన బుగ్గల్ని అతనో ఎర్ర గులాబీ పువ్వుతో రాస్తూ పాట పాడేడు. ఏం పాట చెప్మా అది? ఆ..."ప్రియా. నిన్నే కాంక్షిస్తున్నాను. నువ్వు తప్ప నాకింకో ధ్యాస లేదు. నీ మెత్తని గుండెలో నాకో చెప్పని చోటివ్వు. ప్రేమ అనే ఖడ్గం చేపట్టి నీ హృదయసామ్రాజ్యం ఏలుతాను," అనే అర్థం వొచ్చే పాట...తెల్లవారింది. కల కరిగిపోయింది..." "ఆ కల అలాగే వుండిపోతే ఎంత బావుణ్ను" అనుకుంది సుందరి.

అంతలో తలుపు చప్పుడైంది. వెళ్ళి తీసింది. నాగేశ్వరరావు!

"ఓ మీరా? రండి...రండి" అని కుర్చీ చూపించి లోపలికి వెళ్ళిపోయింది. గౌన్ విప్పేసి గబగబ చీర చుట్టబెట్టుకుంది. జాకెట్టు గుండీలు పెట్టుకుంటూ నాగేశ్వరరావున్న గదిలోకి నడిచింది.

"ఏమండీ ఇలా ఇంత పొద్దున్నే వేంచేసేరు? ఏదో విశేషమే వుండుంటుంది" అంది.

ఆ మాటలు విని నిశ్శబ్దంగా నవ్వేడు నాగేశ్వరరావు.



# మీకుపయోగించే పుస్తకాలు

**దైవదర్శిని . . . రూ.15.**
జీవితవిజయాలకు, బాధలవిముక్తికి, దైవసాన్నిధ్యానికి, దైవాన్నిపొందినసిద్ధులు తెల్పిన దివ్యమైనదైవరహస్యాలు.

**ఐదువైద్యవిధానాలు . రూ.30.**
420 రోగాలనివారణకు, ఇంగ్లీషు, ఆయుర్వేద, చిట్కా, ప్రకృతి, హోమియోలలో, ఆయావిధానాలడాక్టర్లు చెప్పినమందులవివరాలున్నాయి. ప్రతివిధానంలోనుకొన్నిరోగాలకుప్రత్యేకతఉంది.

**ఆహారవైద్యము . . . రూ.15.**
రోగాలకుకావలసినమందులన్నీ, వివిధఆహారాల్లో, సహజంగాఉన్నాయి. ఏరోగానికేఆహారంతిని నయంచేసుకోవాలో, నిపుణులుపరిశోధనలు చేసి తెల్పిన ప్రకృతిసహజవైద్యవిధానాలవివరాలున్నాయి.

**మూలికావైద్యము . . రూ.15.**
అల్లం, మిరియాలు మొదలైన మూలికలతో ఖర్చు,శ్రమలేని, పూర్వకాలంనుంచిబాగావాడుకలోఉన్న మంచివైద్యవిధానాలు.

**సేల్సుటాక్సు . . . రూ.25.**
ఆంధ్ర& సెంట్రలు చట్టాలు, నేరాలు, పెనాల్టీలు, అప్పీళ్ళు, మొదలైన అన్నివివరాలతోబాటు, వర్తకులువారిరక్షణకు తెలుసుకోవలసినవన్నీఉన్నాయి.

**ఇన్‌కంటాక్సు . . రూ.25.**
రాబడి, వెల్తు, గిఫ్టు, కేపిటలుగెయిన్సు, వాటివివరాలు, వాటిటాక్సురేట్లు, అప్పీళ్లతోబాటు, సంపన్నులువారిభద్రతకు తెలుసుకోదగ్గవన్నీ ఉన్నాయి.

**వ్యవహారదర్శిని . . రూ.15.**
ముఖ్యచట్టాలవివరాలు, పిటీషన్లు, ఫిర్యాదులు, ఎగ్రిమెంట్లు, దస్తావేజులు, వివిధపత్రాలువ్రాసేవిధానాలు, వాటిఅనేకనమూనాలతోఉన్నాయి.

**మీస్వప్నఫలితాలు . రూ.10.**
కలల్లో చూచేవాటి ఫలితాలుతెల్పే స్వప్నాలడిక్షనరీ.

**మానసికశక్తులు . . రూ.10.**
హిప్నాటిజం, మెస్మరిజం, ఆకర్షణశక్తి, దూరశ్రవణం, అతీంద్రియశక్తులు, వాటివివరాలు, వాటి సాధనమార్గాలు.

**రసికప్రియకథలు . రూ.10.**
మంచిఆనందాన్నిచ్చే శృంగార వినోద కథలు.

**జీవితరహస్యాలు . రూ.10.**
సుఖసంసారానికి కామ విజయ మార్గాలు.

**యువతి . . . . రూ.10.**
దాంపత్య ఆనందమయ జీవితానికి తెలుసుకోదగ్గవి.

**సంతానము . . . రూ.10.**
అవుసరంలేనపుడు గర్భంరాకుండా 60 నవీనమార్గాలు.

**చేతిపనులు . . . రూ.10.**
సర్దాకు, సంపాదనకు పనికొచ్చేవాటిని తయారుచేసేవిధానాలు.

**మంత్రశక్తి . . రూ.10.**
సంకల్పసిద్ధికి వివిధ మంత్రాలు, వాటి జపనియమాలు.

**అద్భుతహాస్యకథలు . రూ.10.**
నవ్వటానికి, ఇతరులనునవ్వించటానికిచిన్నచిన్నహాస్యకథలు

వీటిరచన ఎ.యస్.మూర్తి. యం.ఏ. పోష్టుఖర్చుగూ.7అదనం. రూ.40కి, ఆపైవిలువకు పోష్టేజిఉచితం. ఈక్రింది ఎడ్రస్సుకు ఉత్తరంవ్రాసి వీటిలోమీకుకావలసినవి, వి.పి.పోష్టుద్వారాపొందండి.
దేశసేవప్రచురణలు, 2-ఇందిరానగరు, వెంగళరావునగరు పోష్టు, హైదరాబాదు-500890.


"అహ ఏవీ లేదండీ నిన్న మీకోవిషయం చెప్పడం మర్చిపోయేను. అది చెప్దావని..." నీళ్ళు నమిలేదు.

"అలాగా...ఈజిట్ టూ లేట్ నా? చెప్పండి"

నాగేశ్వరరావు కుర్చీలోంచి లేచేడు. అద్దం దగ్గర నిలబడున్న సుందరిని సమీపించేడు. మనిషి కొంచెం ఎమోషనల్‌గా కనిపిస్తున్నాడు. ఏవో పరమరహస్యం అతి కష్టంమీద బయట పెట్టోన్నట్టుందతని మొహం.

"సుందరీ, మిమ్మల్ని ప్రేమిస్తున్నాను." అన్నాడు.

సుందరి ఆశ్చర్యపోయింది. ఏడ్వాలో నవ్వాలో తెలీని స్థితిలో వుండిపోయింది.

"అవును సుందరీ మిమ్మల్ని మనస్ఫూర్తిగా ప్రేమిస్తున్నాను. మీ సహచర్యం నా జీవితానికో వెలుగిస్తుందని ఆశిస్తున్నాను" అన్నాడు మళ్ళీ గంపెడాసతో.

"చాలా సంతోషం నాగేశ్వరరావుగారూ. కాని నేను మిమ్మల్ని ప్రేమించలేను. అవును. అంతే క్షమించండి!" అంది సుందరి ఒణుకుతున్న గొంతుకతో.

నాగేశ్వరరావు మారు మాటాళ్ళేదు. తలొంచుకుని వెళ్ళిపోయేడు. వెళ్ళిపోతున్న నాగేశ్వరరావుని చూసి ఎందుకో పకపకా నవ్వింది సుందరి. పిచ్చిదాన్లా జుత్తు విరబోసుకుంది. ఇంకా అలా ఎంతోసేపు నవ్వింది. నవ్వడం అయిపోయేక అద్దం ముందు నిలబడింది. నిలువుటద్దంలో ప్రతిబింబించిన రూపం తన వేపు వెర్రిగా చూసింది. ఆశ్చర్యపోయింది సుందరి.

"అవునే సుందీ! ఎందరో పెళ్ళికొడుకులు నిన్ను చూడ్డానికొచ్చి ఏమొహం వేసేనా చూడకుండా నచ్చలేదని వెళ్లిపోయేరు. ఏ మగాడూ నీకేసి సర్దాకేనా నవ్వుతూ చూడలేదు. అలాంటిది అందగాడూ, పాటగాడూ అయిన నాగేశ్వరరావు నిన్ను ఏరికోరి వలచేడు "నిన్ను ప్రేమిస్తున్నా, పెళ్ళి చేసుకో!" అని రిక్వెస్ట్ చేసేడు. అతన్ని రెఫ్యూజ్ చేసేవుకదా? ఏవిటీకారణం? అనంది సుందరి ప్రతిబింబం.

సుందరి మరోసారి ఫకాల్న నవ్వింది. "కారణం వుందే సుందీ, వుంది. ఈ మగాళ్ళందరూ పిచ్చివాళ్ళు. పిల్లకి మొహంలోని అందమే కావాలి. ఆడదాని అందాలు ఎవడికీ తెలీదు. వాళ్ళ హృదయాలూ అక్కర్లేదు. వాళ్ళందర్నీ ఫూల్ చెయ్యాలనిపించింది. వాళ్లమీద నాకున్న 'కసి' తీర్చుకోవాలనిపించింది...అందుకే...నాగేశ్వరరావుని ఫూల్ చేసి ఏడిపించేను. ఇప్పుడైనా అర్థమైందా పిచ్చిపిల్లా? అహ్హహ్హ..." అంటూ అద్దంలోని ప్రతిబింబం మీద పౌడర్ జల్లింది సుందరి.

నవ్వినవ్వి ఇహనవ్వలేక అలసటగా కుర్చీలో కూలబడింది. 'మిమ్మల్ని ప్రేమిస్తున్నా' అన్న నాగేశ్వరరావు మాటలింకా ఆమె చెవుల్లో గింగురుమంటూనే వున్నాయి.

●